సాక్షి చిత్తూరు


బుధవారం । 30 । జూలై । 2025



**మెరుగైన వైద్య సేవలందించాలి**
ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. - 8లో



**జిల్లాను అగ్రగామిగా నిలపాలి**
జిల్లాలోని డ్వాక్రా సంఘాలు రాష్ట్రానికి ఆదర్శంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పీడీ అన్నారు. - 8లో



**మల్లప్ప కొండలో ఏనుగులు**
మల్లప్ప కొండ అటవీ ప్రాంతంలో నాలుగు ఏనుగులు తిష్ట వేశాయని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. - 8లో

## న్యూస్‌రీల్

### జగనన్నను కలిసిన మాజీ మంత్రి రోజా



నగరి : మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మాజీ మంత్రి ఆర్కేరోజా మంగళవారం తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో కలిశారు. వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొన్న అనంతరం నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసే అంశాలపై చర్చించినట్లు మాజీ మంత్రి రోజా తెలిపారు.

### పలువురు సీఐలకు స్థాన చలనం

చిత్తూరు అర్బన్ : జిల్లాలో పలువురు ఇన్‌స్పెక్టర్లను (సీఐ) అటాచ్‌మెంట్‌పై బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ చందోలు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు ట్రాఫిక్‌లో పనిచేస్తున్న జి.నిత్యబాబును చిత్తూరు తూర్పు (తాలూక), తాలూకలో పనిచేస్తున్న బి.శ్రీనివాసరావును చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్, వేకెంట్ రిజర్వు (వీఆర్)లో ఉన్న కె.లక్ష్మీనారాయణను చిత్తూరు ట్రాఫిక్, మహిళా స్టేషన్‌లో పనిచేస్తూ, వన్‌టౌన్‌లో అదనపు విధులు నిర్వర్తిస్తున్న సీఐ ఎం.మహేశ్వరను వన్‌టౌన్‌కే పరిమితం చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

### ఎంపీటీసీ ఎన్నిక షెడ్యూల్ జారీ

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని రామకుప్పం మండలం మనేంద్రం ప్రాంతం ఎంపీటీసీ ఎన్నిక షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల అధికారి నీలంసాహ్ని జారీ చేశారని జెడ్పీ సీఈఓ రవి కుమార్‌నాయుడు తెలిపారు. మంగళవార జెడ్పీ కార్యాలయంలో వివరాలను తెలియజేశారు. గతంలో ఆ ప్రాంతం ఎంపీటీసీగా ఉన్న శాంతికుమారి చనిపోవడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడిందని గుర్తు చేశారు. 30న నామినేషన్ దాఖలు, ఆగస్టు 1న స్వీకరణకు చివరి రోజు, 2న పరిశీలన, 3 అప్పీల్, 4న అప్పీళ్ల పరిష్కారం, 5న నామినేషన్ ఉపసంహరణ, అభ్యర్థుల ప్రకటన, 12న పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు తదుపరి విజేతల ప్రకటన ఉంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణ పనులు చేపట్టామని వివరించారు.

### పది రోజుల్లో మార్పు చూపాలి



రికార్డులు పరిశీలించి సూచనలిస్తున్న డీఈఓ


చౌడేపల్లె : స్కూల్‌కు పది రోజుల తరువాత మళ్లీ వస్తా.. వంట గది మార్చాలి... కట్టెల పొయ్యిపై బదులు గ్యాస్‌పై మధ్యాహ్న భోజనం రుచిగా నాణ్యతగా చేయాలని డీఈఓ వరలక్ష్మి వంట నిర్వాహకులు, హెచ్‌ఎంను హెచ్చరించారు. మంగళవారం చౌడేపల్లె ఉన్నత పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తిని రుచి చూశారు. గ్యాస్ పొయ్యిపై వంట చేయకుండా కట్టెల పొయ్యిపై ఎందుకు చేస్తున్నారు.? కచ్చితంగా గ్యాస్ పొయ్యిపై వంట చేయాలని వంట నిర్వాహకులకు సూచించారు. మెనూ ప్రకారం కూరగాయలు, పప్పు వినియోగించాలని నాణ్యత పాటించాలని ఆదేశించారు. వంట గది పరిశుభ్రత పాటించలేదని, వంట నిర్వహణ ప్రదేశాన్ని మార్పుచేయాలని హెచ్‌ఎం నాగరాజరెడ్డికి సూచించారు. ఉన్నత పాఠశాల ఆవరణంలో నాడు–నేడు ద్వారా గత ప్రభుత్వంలో చేపట్టి అసంపూర్తిగా మిగిలిన తరగతి గదుల నిర్మాణ పనులకు నిధులు మంజూరునకు కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. విద్యా బోధనపై ప్రత్యేక దృష్టి సారించి రానున్న 'పది'పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని డీఈఓ సూచించారు. ఆమె వెంట ఎంఈఓ–2 తిరుమలమ్మ, సీఆర్పీలు ఉన్నారు.

### గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కార్వేటినగరం : మండల కేంద్రంలోని ఆర్కే ఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ స్వరూప పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యలో ఖాళీగా ఉన్న ఎంఎల్‌టీ కోర్సు బోధించడానికి అతిథి అధ్యాపకులు అవసరమన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు మెడికల్ గ్రాడ్యుయేట్స్ లేదా ఎంఎస్సీ మైక్రో బయాలజీలో 50 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆగస్టు 1వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

---

సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కొక్కటీ తుస్సుమంటున్నాయి. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలు అయోమయానికి గురవుతున్నారు. కూటమి నేతలు ఒక్కొక్కరూ ఒక్కోసారి జిల్లాకే ఉచితమని, పల్లె వెలుగు బస్సులకే పరిమితం అంటూ ప్రచారం చేస్తూ మహిళలను ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఊరిస్తున్నారు. హామీలు ఇచ్చినప్పుడు ఎలాంటి ఆంక్షలు లేవని అమలులో కుంటి సాకులు ఏంటని మహిళలు మండిపడుతున్నారు. చంద్రబాబు మాట మార్చకుండా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో మహిళలకు ఆంక్షలు లేకుండా ఉచిత ప్రయాణం కల్పించాలని కోరుతున్నారు.



# ఆంక్షల బస్సు!

- వేధిస్తున్న బస్సుల కొరత
- ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు కల్పిస్తామంటున్న ప్రభుత్వం
- కేవలం పల్లె వెలుగు బస్సులకే పరిమితమా?
- జిల్లా వరకే పరిమితం చేయనున్న వైనం
- ఉచితం ఉమ్మడి జిల్లాకు కూడా అనుమానమే!
- అరకొరగానే సిబ్బంది
- మాట తప్పొద్దంటున్న మహిళలు

కాణిపాకం : మహిళలకు ఉచిత బస్సు హామీ మాటల గారడీలా కనిపిస్తోంది. ఉచితం కేవలం పల్లె వెలుగును మాత్రమే పరిమితం చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్త ప్రయాణంతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సుల ప్రయాణం ఉండదనే అనుమానాలు మహిళల్లో వ్యక్తం అవుతోంది. దీనికి తోడు డ్రైవర్, కండక్టర్, బస్సులు కొరత వేధిస్తోంది. పల్లెకు అరకొర సేవలతో నెట్టుకొస్తున్నారు. పల్లె వెలుగులో డొక్కు బస్సులు, కాలం చెల్లినవే ఉన్నాయని, ఆంక్షలు లేని ఉచిత బస్సును ప్రవేశ పెట్టాలని మహిళలు కోరుతున్నారు.

**బస్సుల సంఖ్య పెంచకుండా..**
ప్రస్తుతం జిల్లాలో 1.20 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే మరో 10 నుంచి 20 శాతం మంది అధికంగా ప్రయాణించే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెంచాలని ప్రభుత్వానికి నివేదికలను పంపారు. అయితే ఆ దిశగా బస్సుల సంఖ్య పెంచకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఉన్న బస్సులు సైతం ఉచితానికి మొరాయిస్తున్నాయి. అల్ట్రా బస్సులు ఉచితంలో చేర్చిన జిల్లాలో ఆ బస్సులు లేవు. అలాగే ఒక్క సిటీ బస్సు కూడా తిరగడం లేదు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులను కూడా ఉచితానికి ఇవ్వరనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా చేస్తే ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు అరకొర అని చెప్పవచ్చు. దీనికి తోడు రాష్ట్ర వ్యాప్త ఉచిత ప్రయాణానికి ఎసరు పెడుతున్నారని పలువురు మహిళలు విమర్శలు గుప్పిస్తున్నారు.

**బస్సు కండీషన్ అంతంతే....**
గ్రామీణ జనాభా అధికంగా ఉన్న జిల్లాలో ఆర్టీసీ సేవలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. డిపోలలో బస్సుల కొరత తీవ్రంగా ఉంది. ఉన్న బస్సుల్లో చాలా వరకు కండీషన్‌లో లేవు. కాలం చెల్లాయి. కుప్పం, పలమనేరు, చిత్తూరు వన్ వంటి డిపోల్లో బస్సులు డొక్కు బడ్డాయి. ఎక్కడిక్కడికి నిలిచిపోతున్నాయి. ప్రమాదం నుంచి తప్పించుకున్న ఘటనలు చూస్తున్నాం. మరో వైపు డ్రైవర్లు, కండక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని భర్తీ చేయలేదని ఆర్టీసీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పల్లెకు బస్సులు కరువు**
జిల్లా వ్యాప్తంగా 697 పంచాయతీలుంటే వీటి కింద సుమారు 6 వేల గ్రామాలున్నాయి. ఆర్టీసీ నష్టాలను సాకుచూపి కేవలం 164 రూట్లల్లో మాత్రమే బస్సులను తిప్పుతున్నాయి. ఈ మార్గాల్లోని 708 గ్రామాలకు మాత్రమే పల్లె వెలుగు సేవలు అందుతున్నాయి. మిగిలిన గ్రామాలకు పల్లె వెలుగు సేవలు అందని ద్రాక్షలా మారాయి. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని గ్రామాల ప్రజలు ఆటోలపై ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు బడులు, కళాశాలలకు వెళ్లడానికి కూడా ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయకపోవడంతో ఆటోలలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తేనే ఉచిత బస్సు ప్రయోజనాలను మహిళలు పొందగలుగుతారు. లేకపోతే కూటమి ప్రభుత్వం ప్రచారానికి మాత్రమే ఈ పథకం అమలు పరిమితం కానుంది.

### ఇదీ ఎన్నికల హామీ

ఎన్నికల ముందు కూటమి నేతలు ఇంటింటికి తిరిగి రాష్ట్రమంతా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఊదరగొట్టారు. తాజాగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కేవలం పల్లె వెలుగు, అల్ట్రా డీలక్స్ బస్సులలో మాత్రమే సదుపాయం ఉంటుందని అక్కడక్కడా చెబుతుండడంపై మహిళలు అసహనం వ్యక్తం చేసున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఎక్కడా పల్లెవెలుగు, అల్ట్రా డీలక్స్ బస్సులలో మాత్రమే ఉచితమని చెప్పలేదు. తీరా అధికారం చేపట్టిన తరువాత చంద్రబాబు హామీలపై ఆంక్షలు పెట్టారని మహిళలు ఆరోపిస్తున్నారు. చిరువ్యాపారాలు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, విద్యార్థినులు పట్టణాలకు వెళ్లాలంటే ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ సర్వీసులు ఎక్కువగా ఉంటాయి. వాటిలో ప్రయాణ సదుపాయం ఇవ్వకపోతే ఉపయోగమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడున్న ఒకటి అర పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించడం కష్టమని పెదవి విరుస్తున్నారు..

### ఏడాదిగా ఊరిస్తూ..

సూపర్–6లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణమన్న హామీని ఏదాది దాటినా అమలు చేయకుండా వాయిదాల మీద వాయిదాలు వేస్తూ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తూ వస్తోంది. గత కొంత కాలంగా ఆగస్టు 15 నుంచి ఉచిత ప్రయాణం ప్రారంభిస్తామని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఉచిత బస్సు అమలుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆంక్షలు పెట్టి ఉచిత బస్సు ప్రయాణాన్ని నెట్టుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### సరిపడా బస్సులు ఏవీ?

జిల్లావ్యాప్తంగా 5 ఆర్టీసీ బస్సు డిపోల పరిధిలో మొత్తం 463 బస్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఆర్టీసీ బస్సులు 392, అద్దె బస్సులు 71 దాకా నడుస్తున్నాయి. వీటిలోఆర్టీసీకి సంబంధించిన పల్లె వెలుగు బస్సులు 232, అద్దె బస్సుల కింద 35 పల్లె వెలుగు బస్సులు తిరుగుతున్నాయి. ఇవే జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. ఇప్పటికే ఆయా రూట్లలో బస్సులు తక్కువగా ఉండటం, రోడ్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆర్టీసీ సర్వీసులపై గతేడాదిగా విమర్శలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉచిత బస్సు ప్రయాణమంటే కొంత ఆక్యుపెన్సీ పెరిగే అవకాశం ఉంటుంది. జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం మహిళలు 11,49,661 మంది ఉన్నారు. ఇంత మంది మహిళలున్నా కేవలం 232 పల్లెవెలుగు బస్సులకు మాత్రమే ఉచిత సదుపాయం ఇవ్వడమేంటని మహిళామణులు ప్రశ్నిస్తున్నారు.



ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు టికెట్ కొడుతున్న కండక్టర్

### జిల్లాలోని బస్సుల సమాచారం

| బస్సు రకం | సంఖ్య |
| --- | --- |
| ఇంద్ర | 4 |
| సూపర్ లగ్జరీ | 32 |
| సప్తగిరి ఎక్స్‌ప్రెస్ | 35 |
| పల్లె వెలుగు | 232 |
| బడిబస్సులు | 15 |
| అద్దెబస్సులు | 71 |

### ఉచిత బస్సుకు కండీషన్లు పెట్టొద్దు



ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు కల్పిస్తామంది. ఈ మేరకు ఉచిత బస్సును అమలు చేయాలి. మాట ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సుల సౌకర్యం కల్పించాలి. పల్లె వెలుగు మాత్రమే పరిమితం చేయకుండా..అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి. ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.
– కోకిల, కుప్పం

### ఉచితంపై వెనుకడుగు వేయొద్దు



ప్రభుత్వం ఏదైతే చెప్పిందో అది నెరవేర్చాలి. ఉచిత బస్సు విషయంలో వెనకడుగు వద్దు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఉచితంగా ప్రయాణించేలా బస్సు సౌకర్యం కల్పించాలి. కొన్ని బస్సులకు మాత్రమే ప్రయాణాన్ని సర్దుబాటు చేయొద్దు. చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి. ఆటోల ప్రయాణంతో అవస్థలు పడుతున్నాం.
– సరిత, యాదమరి

---

## పీ–4పై వేధింపులు దారుణం

**జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు**



జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట : సూపర్ సిక్స్ హామీల అమలులో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజల దృష్టిని మరల్చేందుకే ''పూర్‌టూ రిచ్''అనే పేరుతో పేదలను ధనికులు దత్తత తీసుకోవాలంటూ పీ–4 కార్యక్రమాన్ని ప్రారంభించిందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు విమర్శించారు. మంగళవారం మండలంలోని పి.కొత్తూరు క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన జీరో పావర్టీ పీ–4 కార్యక్రమం అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులకు భారంగా మారిందన్నారు. ప్రభుత్వం 24 ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు, ఉపాధ్యాయులు, గ్రామ సచివాలయ సిబ్బందికి పేద కుటుంబాల దత్తత కోసం కాల పరిమితిని విధించి టార్గెట్లు విధించడం ఏమిటని ప్రశ్నించారు. జీరో పావర్టీ (పీ–4) కార్యక్రమం పేరుతో ప్రతి హెచ్‌ఎం, టీచర్లు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయాలని ఒత్తిడి చేయడం సబబు కాదన్నారు. చిరుద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలే సక్రమంగా ఇవ్వని నేపథ్యంలో వారిని నిర్బంధం చేయడం అన్యాయమన్నారు. ఈనెల 31వ తేదీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటన షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో ఆయన పర్యటనలో ప్రజాభిమానాన్ని అడ్డుకునేందుకు పోలీసులు కఠిన ఆంక్షలు విధించడం దారుణమన్నారు. హెలీప్యాడ్ వద్దకు కేవలం పది మందిని మాత్రమే అనుమతిస్తామని, అభిమానులు తరలి రావడానికి అవకాశం లేదని, ర్యాలీగా వెళ్లొద్దని వివిధ ఆంక్షలతో వైఎస్సార్‌సీపీ నేతలకు నోటిసులు ఇవ్వడంపై జెడ్పీ చైర్మన్ మండిపడ్డారు.

### ఐరాలలో చిరుత కలకలం

ఐరాల : మండల కేంద్రానికి కూతవేటు దూరంలో నగిరి సమీపంలో ఉన్న నర్సరీ వద్ద సోమవారం సాయంత్రం కొండపై చిరుత సంచరిస్తున్నట్లు డీఆర్‌ఓ రాకేష్‌కుమార్ తెలిపారు. నర్సరీ వద్ద పనులు చేస్తున్న కూలీలు చిరుత సంచరిస్తున్నట్లు సమాచారం అందించారని చెప్పారు. రైతులు పశువులు, దూడల మేత కోసం అటవీ ప్రాంతానికి వెళ్లరాదని సూచించారు. పరిసర ప్రాంత ప్రజలు రాత్రి సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రాత్రి వేళల్లో పాడి ఆవులు, దూడలను పొలాల వద్ద ఉంచరాదని తెలియజేశారు. ఐరాల– చిత్తూరు మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు రాత్రిపూట ప్రయాణం రద్దు చేసుకోవాలని సూచించారు. చిరుత కనిపిస్తే వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని గ్రామస్తులను ఆయన కోరారు.

## బెయిల్ రావాలంటూ పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చౌడేపల్లె : అక్రమ కేసులో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు కావాలని కోరుతూ స్థానిక కమలాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలు ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, మాజీ బోయకొండ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, మాజీ సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, పార్టీ నేతలు కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యుల పేరిట ప్రత్యేక అర్చనలు, అభిషేక పూజలు చేశారు. అక్రమ కేసుల నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి త్వరగా కడిగిన ముత్యంలా బయటకు రావాలంటూ పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు షంషీర్0, వరుణ్ నాయకులు తాణాధార్ నాగరాజ, వెంకట రమణ, అమరనాథ్, పవన్, భాస్కర్, హరీష్, విజయ్, కృష్ణారెడ్డి, బాబు, చంద్రశేఖర్, మంజునాథ్, తదితరులున్నారు.

---

## టెండర్ లేకుండానే పనులా?

- రూ.కోట్ల పనులు నామినేట్‌గా తమ్ముళ్లకే
- నిబంధనలు గాలికి.. ఇష్టానుసారంగా పనులు
- చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇష్టారాజ్యం





చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో ఫుట్‌పాత్ పనులు, కలెక్టర్ బంగ్లా లోపల నిర్మిస్తున్న ప్రహరీ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండుకు సంబంధించిన స్థలం. గతంలో ఇక్కడ వేసిన రోడ్డుకు ఆర్టీసీ సంస్థ నుంచే నిధులు కేటాయించారు. పిలవని పేరంటానికి తామున్నామంటూ ప్రస్తుతం దాదాపు రూ.45 లక్షల వ్యయంతో మున్సిపల్ కార్పొరేషన్ ఇక్కడ ఫుట్‌పాత్ నిర్మిస్తోంది. రూ.45 లక్షలు ఏ మురికివాడ అభివృద్ధి, శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులకో వెచ్చిస్తే పన్నులు చెల్లించే ప్రజలు హర్షిస్తారు. ఇక ఈ పనులు చేయడానికి కార్పొరేషన్ ఆన్‌లైన్ టెండర్లు పిలవగా, మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు సమయం ఉంది. ఆపై ఎవరెవరు టెండర్లు వేసారో చూసి, తక్కువ మొత్తం కోట్ చేసిన వారికి పనులు అప్పగించాలి. నెల్లూరులోని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ నుంచి అనుమతి పొందాలి. వర్క్ ఆర్డర్ ఇవ్వాలి. ఇవన్నీ జరగడానికి 30 రోజుల సమయం పడుతుంది. అసలు ఆన్‌లైన్ టెండర్లు తెరవకుండానే, టెండరు ఎవరికి వచ్చాయో తెలియకుండా పనులు చేసేస్తున్నారు. కార్పొరేషన్ ఏఈఈ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తుండటం విశేషం. చిత్తూరులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ నిధుల్లోని దాదాపు రూ.43 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ప్రహరీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హై రోడ్డు విస్తరణపై ప్రభుత్వం నుంచి పరిహారంపై ఎలాంటి ప్రకటన రాకమునుపే.. కొంగారెడ్డిపల్లె రోడ్డు విస్తరణ తెరపైకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా అత్యవసరంగా రూ.43 లక్షలతో నిర్మిస్తున్న ఈ పనులకు కార్పొరేషన్‌లోని ఏ నిధులు వెచ్చించాలి..? అంచనాలు ఎంత..? ఆన్‌లైన్ టెండరు ప్రక్రియ ఎప్పుడు ప్రారంభించాలి..? ఇలాంటి ఏ ఒక్క నిబంధన పట్టించుకోకుండా ప్రజాధనం నిబంధనలకు విరుద్ధంగా వెచ్చిస్తున్నారు.

**లెటర్ ఇస్తే సరిపోతుందా..?**
అభివృద్ధి పనుల విషయంలో ఆన్‌లైన్‌లో ఒకరికన్నా ఎక్కువ మంది పోటీపడితే.. స్వయాన ఇంజినీరింగ్ అధికారులు దళారులుగా అవతారం ఎత్తుతున్నారు. టెండరు వచ్చిన వ్యక్తి నుంచి పలు కారణాలతో తాను ఈ పని చేయలేకపోతున్నానంటూ లెటర్లు తీసుకుంటున్నారు. ఇది నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. కానీ అధికారులు ఏమాత్రం వీటిని పట్టించుకోవడంలేదు. కార్పొరేషన్‌లో టెండర్ల వ్యవహారంలో దాదాపు అధికార పార్టీ నాయకులే పాల్గొంటున్నారు. ఎవరికి టెండరు వస్తే వాళ్లు పనులు చేసుకోవచ్చు. కానీ ఇలా టెండర్లు పూర్తవకుండానే పనులు చేయడంపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ పొరపాట్లను సరిదిద్దుకుని ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉంది.

### టెండర్ లేకుండానే తమ్ముళ్లకు పనుల పంపకాలు

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సివిల్ పనులు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. తమ అనుచరులకు పనులు కట్టబెట్టడానికి అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేయడం, వీటిని అమలు చేయడంలో అధికారులు కనీస నిబంధనలు పాటించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రూ.లక్ష దాటిన ప్రతి ఒక్క పనికి ఆన్‌లైన్ టెండరు పిలవాల్సి ఉంది. కానీ ఎలాంటి టెండర్లు లేకుండానే నగరంలోని పలు ప్రాంతాల్లో రూ.కోట్ల వ్యయంతో పనులు చేసేస్తున్నారు. ఎవరు చేస్తున్నారో..? రేపు టెండర్లలో పోటీ వస్తే ఏం చేయాలి..? సరైన పత్రాలు లేకుండా టెండరు తిరస్కరణకు గురైతే పరిస్థితి ఏంటి..? అనే విషయలపై అధికారులు ఏమాత్రం ఆలోచించడంలేదు.

### తప్పని తేలితే చర్యలు



అభివృద్ధి పనుల్లో నిబంధనలు పాటించకుండా ఉండటం అంటూ ఏమీ లేదు. కొన్ని పనులు కౌన్సిల్ ముందస్తు అనుమతితో అత్యవసర దృష్ట్యా చేయిస్తున్నాం. వాటర్ వర్క్స్, లైట్స్, టాయ్‌లెట్స్ అనేవి అత్యవసరం. నామినేటెడ్ పనులు ప్రత్యేకించి ఒకరికి ఇవ్వడంలేదు. టెండర్ల దశలో ఉన్న అంశాలకు ముందస్తుగానే పనులు ప్రారంభించడం నా దృష్టికి రాలేదు. దీనిపై ఇంజినీరింగ్ అధికారుల నుంచి సంజాయిషీ తీసుకుంటా. తప్పని తేలితే చర్యలు తీసుకుంటాం.
– నరసింహ ప్రసాద్, కమిషనర్, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్

### విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తాం



కార్పొరేషన్ అధికారులు తప్పు మీద తప్పు చేస్తున్నారు. టెండర్లు పూర్తవకుండానే పనులు చేయడం చట్ట విరుద్ధం. అలాంటప్పుడు మీకు నచ్చినవాళ్లకు పనులు అప్పగించుకోండి. టెండర్లు ఎందుకు పిలవడం. నగర అభివృద్ధిని మా పార్టీ ఎప్పుడూ స్వాగతిస్తుంది. కానీ అదే సమయంలో నిబంధనలు పాటించకుండా అంతా మా ఇష్టం అంటే కుదరదు. నాయకులు చెప్పారని అధికారులు ఇష్టం వచ్చినట్లు చేస్తే, రేపు దోషులుగా నిలబడేది అధికారులే. విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేస్తాం. – ఎంసీ.విజయానందరెడ్డి, చిత్తూరు సమన్వయకర్త, వైఎస్సార్‌సీపీ

# ఆలయ పనులపై పెత్తనం

- ఆలయ పునఃనిర్మాణ పనులను అడ్డుకున్న టీడీపీ నేత
- ఎమ్మెల్యే అనుమతి లేకుండా పనులొద్దంటూ హెచ్చరికలు
- మాజీ ఎమ్మెల్యే సొంత నిధులతో ఆలయ నిర్మాణం
- జనంలో పేరొస్తుందని అడ్డగింత
- ఆగిన చౌడేశ్వరమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులు



తోటకనుమ వద్ద చౌడేశ్వరి ఆలయ నిర్మాణ పనులను టీడీపీ నేతల అడ్డగింపుతో ఆగిన పనులు

**పలమనేరు/వీకోట :** ఆ గ్రామంలో పురాతన ఆలయం. గతంలో ఓ వెలుగు వెలిగి ఇప్పుడు దూప దీప నైవేద్యాలకు దూరమైంది. ఆ ఆలయాన్ని పునఃనిర్మించాలని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పూనుకున్నారు. గ్రామపెద్దల ఆదేశాల మేరకు కోటి రూపాయలతో సొంతంగా ఆలయ పనులు చేసేందుకు సిద్ధమయ్యారు. ఆలయం వద్ద పనులు చేస్తుండగా మాజీ ఎమ్మెల్యేకు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని భయపడిన ఆ మండల టీడీపీ నేతలు గుడి నిర్మాణ పనులను చేయొద్దంటూ బెదిరింపులకు దిగారు. దీంతో పనులు ఆగిపోయాయి. ఈ సంఘటన పలమనేరు నియోజకవర్గంలోని వీకోట మండలం తోటకనుమ గ్రామంలో మంగళవారం వెలుగు చూసింది.

### పురాతన చౌడేశ్వరి ఆలయం


తోటకనుమ గ్రామంలో 50 ఏళ్ల కిందట చౌడేశ్వరీ దేవి, పటాలమ్మ దేవతగా పిలువబడే ఆలయం ఉంది. ఇక్కడ తరచూ పూజలు విజయ దశమికి ఉత్సవాలు జరుగుతుంటాయి. ఈ ఆలయానికి వంశపారంపర్య అర్చక కుటుంబం కూడా ఉంది. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన వెంకటేగౌడ గత ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆ ప్రాంత వాసులు ఆలయాన్ని పునఃనిర్మించాలని కోరారు.

### స్థానిక ఎమ్మెల్యే విల్లింగ్ లెటర్ లేదని..

ఆలయాన్ని నిర్మించాలంటే ప్రస్తుత కూటమి ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి విల్లింగ్ లెటర్ లేదనే సాకుతో ఈ పనులకు కుటమి పాలనలో అక్కడి నేతల ద్వారా బ్రేక్ పడింది. దీనిపై గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేను సంప్రదించడంతో ఆయన రూ.కోటి నిధులతో తాను, దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మించేందుకు సిద్ధపడ్డారు. దీంతో ఈ ఏడాది మే నెల 26న తాను చెల్లించిన కాంట్రిబ్యూషన్ డబ్బును వెనక్కివ్వాలని తామే సొంతంగా ఆలయాన్ని నిర్మించుకుంటామని ఎండోమెంట్ అధికారులకు లేఖ రాశారు. దీనిపై 11.06.25 చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎండోమెంట్స్ వారు ఆ శాఖ కమిషనర్‌కు లెటర్ పెట్టారు. ఇందుకు సంబంధించిన ప్రాసెస్ ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

## ఎండోమెంట్ నుంచి ఆలయ నిర్మాణానికి చర్యలు

గ్రామస్తుల విన్నపం మేరకు మాజీ ఎమ్మెల్యే 08.01.24లో ఎండోమెంట్ వారికి ఆలయ నిర్మాణం కోసం అనుమతి కోరారు. దీనిపై ప్రాసెస్ జరిగింది. గుడి నిర్మాణానికి రూ.కోటి అవసరం అవుతుందని ఇందు కోసం సీజీఎఫ్ (కామన్‌గుడ్‌ఫండ్) ద్వారా కాంట్రిబ్యూషన్‌గా రూ.15 లక్షలు జాయింట్ ఖాతాగా చెల్లించాలని ఎండోమెంట్ నుంచి ఆదేశాలందాయి. ఆ మేరకు ఆలయ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆ డబ్బును యూబీఐ బ్యాంకులో జమ చేసి ఇందుకు సంబంధించిన ఫైల్‌ను పంపారు. ఈ తరుణంలోనే ఎన్నికలు రావడంతో నోటిఫికేషన్ దశలో ఈ ప్రక్రియ ఆగిపోయింది.



పునఃనిర్మాణం కోసం జారీ చేసిన కాపీ



కాంట్రిబ్యూషన్‌పై అధికారులు పంపిన కాపీ

## సొంత నిధులతో నిర్మిస్తే పేరొస్తుందని..

ఎండోమెంట్ ద్వారా కాకుండా ఆలయ నిర్మాణాన్ని సొంతంగా చేపట్టాలని రెండురోజుల కిందట మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పనులను మొదలు పెట్టారు. దీన్ని తెలుసుకున్న ఆ మండల టీడీపీ నేత రంగనాథ్ అక్కడ పనులు చేస్తున్న జేసీబీ డ్రైవర్, పనులు చేసేందుకు వచ్చిన కాంట్రాక్టర్‌ను బెదిరించారు. స్థానిక ఎమ్మెల్యే అమరన్న మాట లేంది ఎలా పనులు చేస్తారంటూ బెదిరించి పనులు ఆపివేశారు. ఇది ఆ గ్రామస్తులకు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. ఆలయ నిర్మాణ విషయంలోనూ కూటమి నేతల రాజకీయాన్ని జనం సహించలేకపోతున్నారు. ఈ విషయమై మదనపల్లి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్‌ను వివరణ కోరగా గతంలో చౌడేశ్వరి ఆలయానికి సంబంధించిన ప్రాసెస్ జరిగిన మాట నిజమేనన్నారు. అయితే నోటిఫికేస్ దశలో ఆగిందన్నారు. ఇప్పుడు ఆలయ చైర్మన్ తమశాఖ ద్వారా వద్దని సొంతంగా ఆలయాన్ని నిర్మించుకోవాలంటే స్థానిక ఎమ్మెల్యే విల్లింగ్ అవసరంలేదన్నారు. వారు బ్యాంకులో చెల్లించిన డబ్బు సైతం వెనక్కిరావడం జరుగుతుందని తెలిపారు.

## ఆలయ నిర్మాణంలో రాజకీయ జోక్యం



తమ సొంత గ్రామంలో అమ్మవారి గుడి పునర్ నిర్మాణం కోసం గతంలో ఎండోమెంట్ ద్వారా ప్రయత్నించాం. కుదరకపోవడంతో తాను దాతల సాయంతో ఆలయాన్ని నిర్మించేందుకు ఎండోమెంట్‌తోనూ పనిలేదు. కానీ ఎక్కడ మాకు మంచి పేరొస్తుందోనని వీ కోటకు చెందిన టీడీపీ నేత రంగనాథ్ ఆలయ పనులు నిలిపేయాలని, ఏ పని కావాలన్నా స్థానిక ఎమ్మెల్యే పర్మిషన్ ఉండాలని చెప్పడం బాధాకరం. దీన్నంతా జనం చూస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న వ్యవహారాన్ని ఆ చౌడేశ్వరమ్మే చూసుకుంటుంది.

– వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

## క్లుప్తంగా

### నవోదయలో 9,11 తరగతులకు ప్రవేశాలు

**చిత్తూరు కలెక్టరేట్ :** నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో అడ్మిషన్లకు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా వలసపల్లి నవోదయ కళాశాల ప్రిన్సిపల్ గీత కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో పలు వివరాలు వెల్లడించారు. 2026–27 విద్యా సంవత్సరానికి అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం వలసపల్లి జవహర్ నవోదయ విద్యాలయంలో అడ్మిషన్లకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. 2026–27 విద్యాసంవత్సరంలో 9వ తరగతిలో అడ్మిషన్లు పొందేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 01–05–2011 నుంచి 31–07–2013 మధ్య జన్మించి ఉండాలన్నారు. అదే విధంగా 11వ తరగతిలో అడ్మిషన్లకు ప్రస్తుతం 10 వతరగతి చదువుతూ 01–06–2009 నుంచి 31–07–2011 సంవత్సరాల మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఈ అడ్మిషన్‌లకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జన్మించి ఉండాలన్నారు. సెప్టెంబర్ 23వ తేదీలోపు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2026వ సంవత్సరం ఫిబ్రవరి 7వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆమె వెల్లడించారు.

### బంగారు దుకాణాల తనిఖీ

**పుంగనూరు :** పట్టణంలోని బంగారు దుకాణాలను ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేపట్టారు. తిరుపతి నుంచి లీగల్ మెట్రాలజీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కంట్రోలర్ స్వామి హాజరై నగిరి ప్యాలెస్ వద్ద ఉన్న ఓ దుకాణాన్ని తనిఖీ చేశారు. బంగారు దుకాణంలోని తూకాలను సంబంధించిన మిషన్‌ను వాటికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఆయన రాకతో బంగారు దుకాణాలు మూత పడడం గమనార్హం.

### మల్లప్పకొండలో ఏనుగుల తిష్ట

**గుడుపల్లె :** మల్లప్పకొండ అటవీ ప్రాంతంలో 4 ఏనుగులు తిష్ట వేయడంతో చుట్టు పక్కల గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. సంగనపల్లె, పెద్దపర్తికుంట, ఓయన్‌కొత్తూరు, శ్రీనివాసపురం, కొటమాకనపల్లె గ్రామాలు అటవీ ప్రాంతాల సరిహద్దు ప్రాంతాల్లో ఉండడంతో రాత్రి సమయంలో ఏనుగులు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి పెద్దపర్తికుంట గ్రామం నుంచి తమిళనాడు రాష్ట్రం సరిహద్దు గ్రామాలైన కొంగనపల్లె, కె.కొత్తూరు, చిగరమాకనపల్లె గ్రామాల మధ్యలోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నాయి. దీంతో కుప్పం అటవీ శాఖ అధికారులు మల్లప్పకొండ చుట్టు ఉన్న గ్రామాలలో దండోరా వేయించారు. రాత్రి సమయాలలో రోడ్డు వెంట ద్విచక్ర వాహనాలలో వెళ్లకూడదని సూచించారు. రైతులు రాత్రి సమయాల్లో పొలాల వద్దకు వెళ్లకూడదన్నారు. వర్షాలు లేకపోవడంతో నీటి కోసం ఏనుగులు ఎక్కడబడితే అక్కడే సంచరిస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు.

## మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడాలి



మాట్లాడుతున్న జడ్జి భారతి

**చిత్తూరు లీగల్ :** మానవ అక్రమ రవాణా నివారణకు పోలీస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో పనిచేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి అన్నారు. మంగళవారం చిత్తూరు న్యాయస్థానాల సముదాయంలోని న్యాయసేవా సదన్ భవనంలో పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. చిన్న పిల్లలు, మహిళలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఇతర మాయ మాటలు చెప్పి పలుచోట్ల అపహరించి.. ఇతర దేశాలకు అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. కొన్ని ఘటనల్లో అక్రమ రవాణా చేసిన వ్యక్తుల నుంచి అవయవాలు బలవంతంగా సేకరించి విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేరం జరగముందే ప్రజలకు ఈ విషయంపై అవగాహన కల్పిస్తూ చైతన్యం తీసుకురావాలన్నారు. అప్పుడే మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుందన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో వివిధ సంస్థల్లో పనిచేస్తున్న అక్రిడియేషన్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో 50 శాతం రాయితీ కల్పించాలని చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి కాశీశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే 50 శాతం ఫీజు రాయితీ ఉత్తర్వులను జారీ చేసేలా చర్యలు చేపట్టాలని డీఆర్‌వో, డీఈవోలను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లాను అగ్రగామిగా నిలపాలి

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని డ్వాక్రా సంఘాలు రాష్ట్రానికి ఆదర్శంగా ఉండేలా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా సమాఖ్యలో సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. జిల్లా స్వయం సహాయక సంఘాల సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆ పథకాలతో ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అభివృద్ధి చెందాలన్నారు. ఈజీ మార్ట్‌ల నిర్వహణలో జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఇదే తరహాలో అన్ని పథకాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలపాలన్నారు. రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వెదురు, మునగ సాగుకు ప్రత్యేక రాయితీ సదుపాయం ఉన్నట్లు తెలిపారు. మునగ పంట ఉత్పత్తులకు ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మహిళా సంఘాలకు డ్రోన్లను రాయితీతో అందిస్తామన్నారు. జిల్లాకు ఎనిమిది యూనిట్‌లు మంజూరైనట్లు తెలిపారు. అరకు కాఫీ యూనిట్లు, కిచెన్ గార్డెన్లు, కోళ్ల పెంపకం వంటి యూనిట్లకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. పీఎం సూర్య ఘర్ పథకం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామీణ మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. నెక్ ఆర్థిక సాయంతో పేద మహిళలు రోడ్డు పక్కన చిన్నపాటి హోటల్ నిర్వహణకు ఎగ్ మార్ట్‌లు జిల్లాకు 40 కేటాయించారన్నారు. ప్రస్తుతం జిల్లాకు 10 యూనిట్లు జిల్లాకు వచ్చాయన్నారు. డ్వాక్రా మహిళలు కొత్త తరహా వ్యాపారాలను ఎంచుకుని ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల, డీపీఎంలు రవికుమార్, సునీత లక్ష్మి, ఏపీఎంలు సుబ్బారెడ్డి, మధు పాల్గొన్నారు.

## ఆటో కాలువలో పడి డ్రైవర్‌కు గాయాలు

**రొంపిచెర్ల :** ఆటో రోడ్డు పక్కన కాలువలో పడి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన రొంపిచెర్ల సమీపంలో పెద్ద చెరువు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. కలికిరికి చెందిన ఆటో రొంపిచెర్లకు వచ్చి తిరిగి కలికిరికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఆటో డ్రైవర్‌ను స్థానిక ప్రవేటు ఆస్పత్రిలో చికిత్సకు తరలించారు. మండలంలో రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకు ఎక్కువ అవుతున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. 40 రోజుల వ్యవధిలో నలుగురు మృతి చెందగా మరో ఏడుగురు గాయ పడ్డారు. నేషనల్ హైవేలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కాలువలో పడిన ఆటో

## బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య



రారాజు మృతదేహం

**పలమనేరు :** బైక్ కొనివ్వలేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పలమనేరు పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక కొత్తపేట ముత్తాచారి పాళ్యానికి చెందిన జయరాముని కుమారుడు రారాజు(19) చదువు పూర్తి చేసి మండలంలోని ఓ పాల డెయిరీలో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో తనకు బైక్ కావాలని ఇంట్లో వారిని అడిగినట్టు తెలిసింది. అయితే గవర్నమెంట్ జాబ్ వచ్చాక తీసుకోవచ్చులేనని వారు చెప్పారు. దీనిపై కలత చెంది మంగళవారం వేకువజామున ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పొద్దున గమనించిన తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఇన్‌చార్జి ఎస్‌ఏఓగా శ్రీనివాసులు

**చిత్తూరు కార్పొరేషన్ :** ట్రాన్స్‌కో చిత్తూరు జిల్లా ఏఓ ప్రసన్న ఆంజనేయులు పదోన్నతిపై కడప జిల్లా ఎస్‌ఏఓగా బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో తిరుపతి జిల్లా ఎస్‌ఏఓ శ్రీనివాసులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎండీ సంతోష రావు ఉత్తర్వులు జారీ చేశారు.

### మద్యం మత్తులో మహిళపై దాడి

**గంగాధర నెల్లూరు :** మండలానికి చెందిన ఓ మాజీ సైనికుడు మద్యం మత్తులో కట్టకిందపల్లి గ్రామంలోని మహిళపై తీవ్రంగా దుర్భాషలాడి చేయిచేసుకుని అడ్డొచ్చిన బంధువులపై దాడి చేసిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల వివరాల మేరకు.. కట్టకింద పల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు రజిని మద్యం తాగి గ్రామంలోని చిన్నమ్మ అనే మహిళను తీవ్రంగా దుర్భాషలాడాడి ప్రశ్నించిన మహిళపై చేయి చేసుకోగా అడ్డొచ్చిన గ్రామస్తులపై దాడి చేశారని తెలిపారు. చిన్నమ్మకు సహాయంగా వచ్చిన గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, చిరంజీవి, రాజా, వెంకటేష్‌పై రజిని, అతని సహాయకులు దాడికి పాల్పడగా తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. చిన్నమ్మ కుమార్తె మాధవి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దాడి చేసిన మాజీ సైనికుడు రజినితో పాటు సహచరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసంతి తెలిపారు.

## కిలో మామిడికి రూ.12 చెల్లించాల్సిందే

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని మామిడి రైతులకు ప్రభుత్వ నిర్ణయం మేరకు కిలోకు రూ.12 కచ్చితంగా చెల్లించాల్సిందేనని మామిడి రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్ డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు మంగళవారం కలెక్టర్‌ను కలిసి పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళీమోహన్ ప్రభుత్వ నిర్ణయం ఉల్లంఘించి రూ.12 అమలు చేయని ఫ్యాక్టరీ యజమానులు, ర్యాంపు నిర్వాహకులపై కఠిన చర్యలుంటాయని వెల్లడించారన్నారు. వారి నిర్ణయం మేరకు ప్రభుత్వం వెంటనే తోతాపురి కి ప్రకటించిన మద్దతు ధర రూ.12 సత్వరం రైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మామిడి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు ఆనందనాయుడు, ప్రధాన కార్యదర్శి హరిబాబుచౌదరి, కోశాధికారి సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులు మునీశ్వరరెడ్డి, మునిరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మామిడి రైతుల సంక్షేమ సంఘం నేతలు

## 'కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ చేపట్టాలి'

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ వెంటనే చేపట్టాలని ఏపీ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్‌ల అసోసియేషన్ ఈసీ మెంబర్ లత డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నిలిచిపోయిన కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ చర్యలు వెంటనే అమలు చేయాలన్నారు. మే 2024 నుంచి 2025 వరకు పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేసిన 62 సంవత్సరాల వయోపరిమితి అమలు చేయాలన్నారు. జీవో 114 ను 2023లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దురదృష్టవశాత్తు అన్ని శాఖల్లో క్రమబద్ధీకరణ పూర్తి అయి విద్యాశాఖలో మాత్రం ఎన్నికల కోడ్ తో నిలిపోయిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ చట్టాన్ని అమలు చేయాలని అనేక వినతులు సమర్పించినా ఫలితం లేదన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్‌ల డిమాండ్‌లను పరిష్కరించకపోతే పెద్ద స్థాయిలో ఆగస్టు 11 న ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ధర్నా నోటీసులను ఈ నెల 28 న విజయవాడలో ఇంటర్మీడియట్ అధికారులకు అందజేశామని ఆమె తెలిపారు.

### మెరుగైన వైద్య సేవలందించాలి

**ఐరాల :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో పలు రికార్డులను తనిఖీ చేశారు. ఫార్మసీ, ల్యాబ్ సేవలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల కట్టడికి పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య సిబ్బంది మారుమూల ప్రాంతాల్లో ఒకటి రెండు సార్లు పర్యటించి ఇమ్యూనైజేషన్ టీకాలు విధిగా వేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీలో మహిళా డాక్టర్‌ను నియమించాలని వైద్యాధికారి రెడ్డెప్ప కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ డీఎంహెచ్ఓకు ఫోన్ చేసి ఐరాల పీహెచ్‌సీకి మహిళా డాక్టర్‌ను నియమించాలని ఆదేశించారు. అనంతరం జాతీయ ఓరల్ రీహైడ్రైషన్ డే సందర్భంగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను కలెక్టర్ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళపై దాడి కేసులో జైలు

**చిత్తూరు అర్బన్ :** ఓ వివాహితపై దాడి చేసిన కేసులో ఏడాది జైలు, రూ.5వేలు జరిమానా విధిస్తూ చిత్తూరులోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.చంద్రశేఖర్ కథనం మేరకు.. చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని చిన్నగొట్టిగల్లు మండలం, గొత్తూరువాండ్లపల్లెకు చెందిన శారద అనే వివాహిత ఇంట్లో ఉండగా.. అదే గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి 2014 జూన్16వ తేదీన అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించాడు. పాత గొడవల నేపథ్యంలో ఆమెతో వాగ్వాదానికి దిగి, దాడి చేశాడన్నారు. కులం పేరిట దూషించి, దాడికి పాల్పడ్డాడంటూ విశ్వనాథరెడ్డిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా.. అట్రాసిటీ కేసు నిరూపణ కాలేదు. మహిళపై దాడి చేసినందుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రమేష్ తీర్పునిచ్చారు.

## అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

– 18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న బైక్‌లు

**గుడుపల్లె :** అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు కుప్పం డీఎస్పీ పార్థసారథి తెలిపారు. మంగళవారం గుడుపల్లె పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. మంగళవారం పీఈఎస్ మెడికల్ కళాశాల వద్ద ద్విచక్ర వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నంబరు ప్లేట్లు లేని వాహనాలు వేగంగా వస్తుండడంతో పట్టుకుని విచారించామన్నారు. ఇందులో తమిళనాడుకు చెందిన అరుణ్‌కుమార్, హరి, మోహన్, మణిగండన్, ముకేష్, దినేష్ అనే ఆరుగురు ముఠా సభ్యులు పట్టుబడ్డారన్నారు. వీరిని విచారించగా వివిధ ప్రదేశాలలో 18 ద్విచక్ర వాహనాలు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. ద్విచక్ర వాహనాల దొంగల ముఠాను చాకచక్యంగా పట్టుకున్న గుడుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందికి ప్రోత్సాకాలు అందించారు. వాహనాల యాజమానులను గుర్తించి వారికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐలు మల్లేష్‌యాదవ్, శంకరయ్య, ఎస్ఐలు శ్రీనివాసులు, నరేష్, వెంకట మోహన్ పాల్గొన్నారు.

### చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఐ

**బైరెడ్డిపల్లె :** బైరెడ్డిపల్లెలో ఇటీవల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ పరశురాముడు పేర్కొన్నారు. బైరెడ్డిపల్లెకు చెందిన మహేష్ అలియాస్ మాలిక్ పుంగనూరు రహదారిలో దుస్తుల వ్యాపారం చేసుకుంటూ ఉండేవాడన్నారు. సమీపంలోని దుకాణాల్లో రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతుండటంతో సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని పట్టుకున్నట్లు వివరించారు. ఈనెల 23, 26 తేదీల్లో ఏఎస్ ప్యాన్సీ స్టోర్‌లో రూ.10 వేలు, గాయత్రీ టీ దుకాణంలో వెండి, బంగారం చోరీ చేశాడన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వివరాలు సేకరించి నిందితుడిని అరెస్టు చేసి అతడి వద్ద చోరీ చేసిన వస్తువులను రికవరీ చేసినట్లు చెప్పారు.

## నూతన రోడ్డు ప్రారంభం



రోడ్డు ప్రారంభించిన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల

**చిత్తూరు కార్పొరేషన్ :** రూ.5 కోట్ల వ్యయంతో నగరంలోని అంబేడ్కర్ భవన్ నుంచి జ్యోతిరావ్ పూలే భవనం వరకు 3.01 కిలోమీటర్ రోడ్డును మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఈ రోడ్డు పూర్తి స్థాయిలో నిర్మాణం కావడంతో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. కట్టమంచి బైపాస్ రోడ్డు పనులకు సంబంధించిన పనులు త్వరలో ప్రారంభించనున్నామన్నారు. వీటితో పాటు కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, హైరోడ్డు, ఇరువారం రోడ్లను విస్తరించి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

**జిల్లా ప్రమాదాల జోన్‌లో ఉంది :** దేశంలో ప్రమాదాలు జరుగుతున్న టాప్ 100 జిల్లాల్లో చిత్తూరు జిల్లా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రయాణాల్లో హెల్మెట్ వాడాలని ఎంత చెబుతున్నా ఎవరూ పాటించడం లేదన్నారు. జిల్లాలో ప్రతి సంవత్సరం 300 మందికి పైగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రమాదాల వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్ నరసింహప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.